ఓం నమో భాగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

## (భుజబలపట్నంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 28.10.95)

ప్రియమైన ఆత్మబంధువులారా,

ఉన్నవస్తువు ఒక్కటే. అది కనబడటం లేదు. కాబట్టి లేదు అనుకొంటున్నాము. పెద్దలు చెప్పినప్పుడు మనకు అర్థం కాకపోతే అర్థం చేసుకొవడానికి ప్రయత్నం చేయాలి కాని భగవంతుడు లేడు అని అనకూడదు. మనకు కనబడనిది, అర్థం కానిది లేదు అనుకోవటం వివేకవంతమైన పనికాదు. ఆధ్యాత్మిక విషయములు శ్రద్ధగా వినటం వలన మంచి తలంపులు వస్తాయి, ఆలోచనయొక్క లోతులు పెరుగుతాయి. మీరు ఇంటి దగ్గర ఏకాంతముగా కూర్చున్నా కాలక్షేపం అవటంలేదు అనే భావన రాదు.

దేహము వచ్చాక మనకు కష్టం వస్తుంది, సుఖం వస్తుంది. పూర్వ జన్మలలో చేసిన పుణ్యం సుఖ రూపములోనూ, పాపము దుఃఖరూపములోనూ ఖర్చు అయిపోతుంది. తెలివికి దీనికి ఏ విధమైన సంబంధము లేదు. విషయమును ఉన్నది ఉన్నట్లుగా గ్రహించడానికి తెలివి అవసరము. ఇతరులు చేసే మోసంలో మనం పడకుండా ఉండటానికి తెలివి అవసరము. కాని కష్టసుఖాలు మన తెలివి మీద ఆధారపడి లేవు. పూర్వ జన్మలలో మనం చేసిన పుణ్యపాపములమీద ఆధారపడి ఉన్నాయి.

మనం కనిపిస్తున్న మనుష్యులనే సరిగా ప్రేమించలేము. కనబడని దేవుని ఎలా ప్రేమించగలము. ఒకరిపట్ల ఒకరు అసూయ పెట్టుకోకూడదు, ద్వేషం పెట్టుకోకూడదు.. పరస్పరము ప్రేమగా ఉండాలి. ఆప్యాయతగా ఉండాలి. ఇదేవిధంగా మనస్సుకు శిక్షణ ఇస్తూ ఉండాలి. మనస్సుకు శిక్షణ ఇవ్వటానికే మనం భూమి మీదకు వచ్చాము.

మనస్సుకు ముందు శాంతి కుదరాలి. ఒక అవతారపురుషుని గాని, గురువును గాని ఎవరినైనా ఆరాధించవచ్చు. మీ మనస్సు ఎక్కడ నిలబడితే ఆవస్తువును ఆరాధించవచ్చును. ఎవరైనా ఒక్కటే. అందరూ దేవుని అంశలే. వీటిలో బేధం పెట్టుకోనవసంలేదు. బేధం పెట్టుకుంటే నోటిలో మట్టిపడుతుంది.

బంధము అనేది ఒక తలంపు. మోక్షము అనేది ఒక తలంపు. నేను బంధములో ఉన్నాను అనుకొనే వాడు నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అనుకుంటూ ఉంటాడు. బంధము, మోక్షము ఇవి రెండూ అహంకారానికే. ఆత్మకు బంధము లేదు, ఆత్మకు మోక్షం లేదు. బంధ, మోక్షములు లేని ఆత్మ సుఖానికి తీసుకొని పోవడానికి భగవాన్ బోధిస్తున్నాడు. మనం రోజూ మూడు అవస్థలను అనుభవిస్తున్నాము. 1. జాగ్రదావస్థ 2. గాఢ నిద్ర 3. స్వప్నము. ఇవి మూడు అహంకారానికే. ఈ మూడింటికి ఆవలిగా ఆత్మ స్థితి ఉంది.

మాయ మనోరూపములో ఉంది. మనస్సు ఎంతసేపు లోకంలోని గొడవలు తెలుసుకోమని చెపుతుంది. వేలాది జన్మలనుండి ఇది లోకంలో ఉన్న దుమ్ము అంతా ప్రోగు చేసుకొని వస్తుంది. ఇవి అన్నీ తెలుసుకోమని చెప్పే మనస్సును బుజ్జగించి, మనస్సును స్వాధీనం చేసుకొని అన్నీ తెలుసుకొంటున్నావు, తెలుసుకొన్నవి సరిపోతాయి, ఇంక నిన్ను నీవు తెలుసుకోమని బ్రతిమాలు అంటున్నారు భగవాన్. నీవు ఎవరో తెలుసుకోమని

మనస్సును అడగాలి. మనస్సుకు తాను ఎవరో తెలిసినపుడు దాని మూలంలోనే దేవుడు ఉన్నాడు కాబట్టి దేవుడు మనకు వ్యక్తమవుతాడు. ఇదీ రహస్యం. ఇది తెలుకోకుండా వల్లంతా బాడీ చేసుకొంటున్నాము. నిన్ను నీవు ఉద్ధరించుకోవటానికి ప్రయత్నించినపుడు దేవుని సహాయం అందుతుంది. మిమ్ములను మీరు బాగుచేసుకోవటం మానివేసి ఎవరో వస్తారు, ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉండకండి.

ఉన్న విషయమును ఉన్నట్లుగా స్పష్టంగా, సరళంగా చెపితే చాలామందికి నచ్చదు. చెక్కాలు వేసి మంత్రాలతోటి అక్కడ ఏదో ఉంది అని చెపితే నమ్ముతారు. మనస్సుకు ఎంతసేపు కల్పన కావాలి. ఎందుచేతనంటే అదికూడా కల్పనే కాబట్టి.

మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. మీకు తెలుసున్నా ఉన్నాడు, తెలియకపోయినా ఉన్నాడు. ఉన్నవాడు లేడు, లేడు అంటే పోడు. ఉన్నవాడు ఎక్కడికి పోతాడు. సర్వకాలములలోను ఉన్నాడు, సర్వ అవస్థలలోనూ ఉన్నాడు. ఆయన శాంతి స్వరూపుడు, శక్తి స్వరూపుడు. నీ బుద్ధి చేసే పనులు, మనస్సు చేసే పనులు, ఇంద్రియాలు చేసే పనులు రికార్డు చేస్తున్నాడు. ఆయన ఏమీ కలగజేసుకోడు. దేవుడికి పక్షపాతము లేదు. ఎవడి ప్రారబ్ధమును బట్టి వాడికి సుఖమో, దుఃఖమో తీసుకొని వస్తాడు గాని ఒకడు అంటే ఇష్టము, ఒకడు అంటే అయిష్టము వాడికి ఏమీలేదు. దేవుడు పక్షపాత రహితుడు. సమానంగా ఉంటాడు.

నేను ఆత్మను అని చెపుతున్నారు కదా నేను ఆత్మను అయినపుడు దాని గురించి నాకు తెలియాలి కదా. నా ఇంద్రియాలు, దేహము తెలుస్తున్నాయి, ఆత్మ గురించి తెలియటం లేదు ఏమిటి అని అడిగితే ప్రతీ మనిషిలోనూ రెండు నేనులు ఉన్నాయి. 1. సత్యమైన నేను, 2. అసత్యమైన నేను. నీకు అసత్యమైన నేను అనుభవంలో ఉంది. కాబట్టి విషయములు, దేహము, ఇంద్రియాలు తెలుస్తున్నాయి. నీకు సత్యమైన నేను అనుభవం లోనికి రావాలి. ఆత్మ గురించి తెలియాలి అంటే, ఆత్మ వైభవం తెలియాలి అంటే ప్రకృతి మనుష్యులను చూడడం కాదు: గాలి వీస్తూ ఉంటే ఆకులు ఎలా కదులు తాయో అలాగే ప్రకృతి మనుష్యుల యొక్క మనసులు కదులుతూ ఉంటాయి. వారికి నిలకడలేదు, సాధన లేదు. ఆత్మ గురించి నీకు తెలియనపుడు ఆత్మ ఎవడికైతే అనుభవంలో ఉందో అటువంటి స్థిత ప్రజ్ఞుడులో ఆత్మవైభవం ఎలా ఉంటుందో, ఆత్మశాంతి ఎలా ఉంటుందో చూడు అని వాసుదేవుడు చెప్పాడు. ఆత్మకు ఆకారములేదు అని చెప్పి ఊరుకోలేదు దాని వైభవం చూడాలంటే జ్ఞానిలో చూడు అని చెప్పాడు.

మీరు దారిద్ర్యముతో బాధపడుతూ ఉంటే మీరు కోటీశ్వరులు అని అందరూ అంటే మీకు ఏమి కలసి వస్తుంది. మీరు దుఃఖముతో బాధపడుతూ ఉంటే విచారంలో ఉంటే మీరు మహర్షులు అంటే ఏమిటి ప్రయోజనము. మహర్షులు పొందే సుఖము, శాంతి మీకు వచ్చినపుడు మీరు మహర్షులు అంటే ప్రయోజనం ఉంది కాని లేకపోతే ప్రయోజనం ఏమీలేదు. పేరు పెట్టుకుంటే సరిపోదు. మహర్షి పొందే సుఖము, శాంతి ఆనందము మీరు పొందాలి.

మనం రోజూ స్నానం చేస్తూ ఉంటాము, భోజనం చేస్తూ ఉంటాము. స్నానం చేయటం, భోజనం చేయటం వలన ఎవరికో ఉపకారం చేస్తున్నాము అనుకొంటున్నామా, లేదు. మనం స్నానం చేయటం, భోజనం చేయటం మన కర్తవ్యం అని అనుకొంటున్నాము. అలాగే ఇంద్రియ నిగ్రహము, మనో నిగ్రహము మన కర్తవ్యం అని అనుకోవాలి. ఇది నా కర్తవ్యము అని ఎవడైతే ఇంద్రియ నిగ్రహానికి, మనోనిగ్రహానికి కృషిచేస్తున్నాడో వాడి మనస్సు చల్లబడుతుంది, వాడి మనస్సు అణుగుతుంది. అణిగిన మనస్సుకు

ఆత్మానుభవం కలుగుతుంది.

మంచిపనులు చేయండి. మంచి విషయాలు వినండి. మంచివిషయాలు చూడండి. ఎవరైనా తెలివితక్కువగా మిమ్మలను విమర్శించినా మీరు వాడిని తిరిగి విమర్శించక్కరలేదు. మిమ్మలను విమర్శించటం వలన వారు గొప్పవారు అయిపోరు. జ్ఞానులు అయిపోరు. మిమ్ములను విమర్శించినపుడు మీరు తిరిగి విమర్శించకుండా ఉంటే మీ దోషముఏమైనా ఉంటే వారికి పోతాయి. భగవంతుడు వారికి transfer చేసేస్తాడు.

మనస్సులో అనుకునేది ఒకటి, నోటితో చెప్పేది ఒకటి, చేతితో చేసేది ఒకటి. ఇంక మనకు జ్ఞానం ఏమిటి? ఇవి మూడూ నిదానంగా ఉన్నవారిని ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు. మనలోనే ఐకమత్యంలేదు. మనస్సుకు, మాటకు, చేతకు ఐకమత్యం లేదు.

ఎదుటి మనిషికంటే మీరు ఎక్కువవారు అనుకోవద్దు, తక్కువవారు అనుకోవద్దు. ఎక్కువవారు అనుకుంటే గర్వం వస్తుంది, తక్కువవారు అనుకుంటే న్యూనతవస్తుంది. అలా అనుకోవద్దు, ఇలా అనుకోవద్దు.

మనం గురువును విడిచిపెట్టినా గురువుమాత్రం మనలను విడిచిపెట్టడు. గురువుపట్ల మనకు హెచ్చు తగ్గులు ఉండవచ్చును. కాని గురువు మనపట్ల సమానంగా ఉంటాడు. తన స్వరూపమును పొందేవరక్నూ మనలనువిడిచిపెట్టడు.

హృదయం అనే గూట్లో మన మనస్సు పడటానికి మనం ప్రయత్నం చేసినపుడు ఈశ్వరానుగ్రహం వస్తుంది. అది ఎప్పుడువస్తుందో చెప్పలేము. అనుగ్రహం వచ్చిన వెంటనే మనస్సు హృదయంలో పడిపోతుంది. అప్పుడు జీవుడు కరిగిపోతాడు. జీవుడు కరిగిపోయినపుడు జీవ లక్షణాలు కరిగిపోతాయి. పునర్జన్మకు కారణం జీవలక్షణాలే. జీవలక్షణాలు ఎప్పుడైతే కరిగిపోతాయో జన్మలేని స్థితికి ఎదుగుతాడు. ఇంక శవాలలోనికి రానక్కరలేదు.

నిజమైన నేను నేను ఉన్నాను అనుకొంటుంది. దానికి Identification అక్కరలేదు. అబద్ధమైననేను నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను అనుకుంటుంది. దానికి ఏదో ఒక దానితో Identification ఉంటుంది. Identification లేకుండాఅది ఉండలేదు.

దేహం మరణించినా మరణంలేని స్థితి ఒకటి మన హృదయంలో ఉంది. దేహం ఉండగానే ఎవడైతే ఆ స్థితిని అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడు మృత్యుంజయుడు అవుతాడు. అమృత స్థితిని పొందుతాడు. అమృతస్థితిని పొందిన వాడికి దేహము ఉన్నా, లేకపోయినా ఒకటే. దేహం ఉండటంవలన లాభం లేదు. దేహంపోవటం వలన నష్టం లేదు. అజ్ఞాని దేహం ఉంటే లాభం అనుకొంటాడు. దేహం పోతే నష్టపోయాము అనుకొంటాడు.

ఇంటిలో పని చేస్తున్నామండి. గుర్తింపు లేదండి అని చెపుతూ ఉంటారు- మనుషుల గుర్తింపు నీకు ఎందుకు. నీవు చేసే పనిని దేవుడు చూస్తున్నాడు. మనుషులు గుర్తిస్తే ఏముంది? గుర్తించకపోతే ఏమైంది? నీకు మార్కులు ఇచ్చేవాడు ఆయన. దేవుడు నీ కష్టమును చూస్తున్నాడు. తగినఫలితమును ఆయన ఇస్తాడు. మీరు కంగారు పడతారు ఎందుకు.

పనికి, జ్ఞానానికి విరోధములేదు. పని మానివేయటంవలన జ్ఞానంరాదు. సాధనచేయటంవలన జ్ఞానం కలుగుతుంది. పని కూడా సాధన క్రింద చేయాలి. పనిలో కూడా దేవుని చూడడం నేర్చుకోవాలి. ఇంటిలోని వ్యక్తులకు సేవ చేసేటప్పుడు వారుకూడా దేవుని రూపాలే అనుకోండి. మీరు చేసేపనే ఇష్టంతో చేస్తే ఉత్తమమైన జన్మలువస్తాయి. ఆపని మిమ్మలను విడిచిపెట్టేస్తుంది. మీరు చేసేపని ఇష్టంతో చేయకపోతే నీచజన్మలు వస్తాయి. ఈ పనే వచ్చే జన్మలో ఎదురవుతుంది. చెయ్యటం ఎలాగూ తప్పటంలేదుకదా. ఇష్టంతో, ప్రేమతో చెయ్యండి.

భగవంతుడు భూమిమీద నడిచేటప్పుడు ఎలా ఉంటాడో స్థితప్రజ్ఞుడిని చూస్తే తెలుస్తుంది. వాడిమాట ఎలా ఉంటుంది, వాడి ప్రేమ ఎలా ఉంటుంది, వాడి వైభవం ఎలా ఉంటుంది స్థిత ప్రజ్ఞుడిని చూస్తే తెలుస్తుంది. నేను మిమ్మలను అందరిని ఎలా ప్రేమిస్తున్నానో మీరు కూడా ఒకరిని ఒకరు అలాగ ప్రేమించుకోండి అని భగవంతుడు చెపుతున్నాడు. ఒకరిని ఒకరు ప్రేమించుకొంటే అభివృద్ధిలోకి వస్తారు. ఒకరిని ఒకరు ద్వేషించుకుంటె పతనమవుతారు.

రాత్రి పడుకునేటప్పుడు, ఉదయం లేచినపుడు, ఇంటిదగ్గర ఖాళీగా ఉన్నపుడు ముక్కులోనుండి లోపలికి వెళ్ళేగాలిని, బయటకువచ్చేగాలిని చూస్తూ ఉండండి. మీరు ఏమీ పేచీ పెట్టుకోవద్దు. ఏమీ బిగపెట్టవద్దు. అప్పుడుకూడా మీ మనస్సు నెమ్మదిగా శాంతపడుతుంది. ఎందుచేతనంటే ఈ గాలిపుట్టచోటు, మనస్సు పుట్టచోటు లోపల ఒకటే.మన మనస్సు guard, ప్రాణం driver. రైలు ఆగినపుడు guard జండా ఊపితేగానిdriver బండిని విడిచి పెట్టడు. మనం చనిపోయేటప్పుడు మనస్సు ఈ జన్మకు సంభందించిన గొడవలు అన్నీ సర్దుకుంటుంది. అప్పుడు జెండా ఊపుతుంది. అప్పుడు ముక్కులో గాలి బయటకు పోతుంది. అదే ప్రాణంపోవటం. చనిపోయేటప్పుడు తలంపులు హృదయంనుండి శిరస్సులోనికి, శిరస్సునుండి హృదయంలోనికి తిరుగుతుంటాయి. అప్పుడు బాగా ఇష్టమైన తలంపును మనస్సు పట్టుకొంటుంది. మీకు ఏ తలంపు అయితే బాగా ఇష్టమో దానిని బట్టి భగవంతుడు రాబోయే జన్మను నిర్ణయిస్తాడు.

భగవంతుని అది కావాలి, ఇది కావాలి అని అడగవద్దు. మీకు ఏమి కావాలో ఆయనకు తెలుసు. ఎప్పుడు ఇవ్వాలో అప్పుడు ఇచ్చేస్తాడు. దేవుని దగ్గరకు వెళ్ళినపుడు నాకు భక్తిని ప్రసాదించు, వైరాగ్యమును ప్రసాదించు, జ్ఞానమును ప్రసాదించు, జ్ఞానమును ప్రసాదించు అని అడగండి. కుటుంబమునకు సంబంధించిన అవసరాలు ఉంటాయికదా అవి అడగవద్దు. ఆయనే ఇస్తాడు. అవి చిన్ని విషయములు. మీరు జ్ఞానమును అడగండి.

నన్ను అనుగ్రహించు, నీవు తప్పనన్ను అనుగ్రహించటానికి ఎవరు ఉన్నారు. ఉన్నది నీవు ఒక్కడివే. నా అహంకారం వలన నేను కూడా ఉన్నాను అనుకొంటున్నాను. నీలో నన్ను ఐక్యం చేసుకో. అప్పుడు ఉన్నది నీవు ఒక్కడివే అని నాకు అనుభవంలోనికి వస్తుంది.

భక్తిగా ఉండండి. పూజ అలవాటు ఉంటే పూజ చేసుకోండి. మీకు ఇష్టమైన దేవుని నామమును స్మరించుకోండి. పగలు అంతా నామము మీ మనస్సులో కాపురం ఉండాలి. పగలు అంతా నామం చేయటం వలన దాని ప్రభావం వలన నిద్రలో కూడా సాధన జరుగుతుంది. పగలు ఏదైతే కష్టపడి చేశారో అది నిద్రలో కలిసివస్తుంది.

*(మురమళ్ళలో శ్రీ నాన్న గారి ప్రవచనములు నవంబరు 13, 14)*